


# ప్రియురాలు పిలిచె

– డా.యండమూరి వీరేంద్రనాథ్



## (గత సంచిక తరువాయి)

6

**ఆ రోజు** ఇల్లంతా హడావుడిగా ఉంది. నగరంలో నలుమూలల్నుంచీ భక్తకోటి శ్రీకళ్యాణి ఇంటికి వస్తున్నారు. రోడ్డు చివరి వరకూ కార్లు బారులు తీర్చి ఉన్నాయి. సరిగ్గా తొమ్మిదిగంటలా పది నిముషాలకు స్వామి ధృవానంద కారు ఆ ఇంటిలోకి ప్రవేశించింది. శ్రీకళ్యాణికి ఆప్తమిత్రుడూ కోటీశ్వరుడూ అయిన మరో వ్యాపారవేత్త స్వామి ధృవానందుని హృషీకేష్ నుంచి ఆహ్వానించారు.

శ్రీకళ్యాణికి దానంతట అదే బాగవ్వాలనీ, తామేమీ చెయ్యలేమనీ డాక్టర్లు పెదవి విరిచినప్పుడు, తోటి పారిశ్రామికవేత్త ఈ స్వామిని సజెస్ట్ చేశాడు. రాజు తల్చుకుంటే కొదవేమున్నది? వెంటనే ఆయనకి కబురు వెళ్ళింది. ఆయన ఢిల్లీ వరకు కార్లో వచ్చి, అక్కడినుంచి విమానంలో వచ్చారు.

ఈ ఏర్పాట్లన్నీ కార్తికేయ స్వయంగా చూశాడు. ప్రొద్దున్నే వచ్చిన భక్తకోటికి ఫలహారా లందించటం నుంచీ స్వామి స్పీచ్ వరకూ అతని పర్యవేక్షణలోనే జరిగాయి. మధ్యాహ్నం స్వామి విశ్రమించారు. అతి దగ్గరవాళ్ళు, చాలా పెద్దవాళ్ళు మాత్రమే హాల్లో కూర్చున్నారు. వాళ్ళు స్వామివారి మహిమలు చెప్పుకుంటూ ఉంటే కార్తికేయ నిశ్శబ్దంగా విన్నాడు.

సాయంత్రం అయిదింటికి స్వామి శ్రీ కళ్యాణిని పరీక్షించాడు. అందరిలోను టెన్షన్. స్వామి గాఢంగా నిశ్వసించారు. ''విష ప్రభావం చాలా ఎక్కువగా ఉంది. కొన్ని రోజులకి అది తగ్గుతుంది. కాస్త వెసులుబాటు కనబడుతుంది. కాస్తంటే... చేతులు గానీ, కాళ్ళు గానీ–''

''అది డాక్టర్లే చెప్పారు కదా'' అనుకున్నాడు కార్తికేయ. ఈ హడావుడి, డబ్బుతో వచ్చే భక్తి. ఇదంతా చూసి అతడి మనసులో ఏదో ఘర్షణ. బాధ వేరు. ఘర్షణ వేరు. మనసు కష్ట పెట్టే విషయం వస్తే బాధ. ఇష్టం లేని విషయం చేయవలసి వస్తే ఘర్షణ. ఆనందం – దుఃఖం; భయం – ఘర్షణ ఇవన్నీ మనసుకి సంబంధించిన రకరకాల స్థాయీ భావాలు. కానీ వీటన్నిటి కన్నా భయంకరమైన స్థితి మరొకటి ఉన్నది. అది– మనసులో నిశ్శబ్దం నిద్రపోవటం. ఏమీ తోచదు. బాధ ఎందుకో తెలీదు. విసుగ్గా, చిరాగ్గా మాత్రం ఉంటుంది. ఆ చిరాకు అతనికి ప్రొద్దున్నించీ చేస్తున్న, చూస్తున్న పనుల వల్ల వచ్చింది. ఈ ఆలోచనలతో రాత్రి చాలా సేపటికి కానీ అతడికి నిద్రపట్టలేదు.

రాత్రి దాదాపు రెండు అవుతుండగా అతనికి అకస్మాత్తుగా మెలకువ వచ్చింది. ఎవరో గంభీర స్వరంతో తనని రమ్మని పిలుస్తున్నట్టు అతను ఫీలయ్యాడు. ఒక అదృశ్య రూపపు ఆహ్వానం. అతడు ఆశ్చర్యపడుతూ, తలుపు తీసుకుని బయటకు వచ్చాడు.

భూదేవి చెక్కిలి మీద ముంగురుల్లా చెట్ల ఆకుల నీడలు. అక్షరాల రేకులతో, పదాల పుప్పొడితో, భావాల పరిమళంతో, వెన్నెల అప్పుడే విచ్చుకున్న కావ్యపుష్పంలా ఉంది. హిమశిఖరాల్లో పల్లవించిన కులకూజితాలు, వేదనాదంతో ప్రభవించిన దివ్యహర్మ్యాలు, దేవళాల గోపురాల్లో కువకువ లాడిన ధర్మ పదాలు, కొన్నేళ్ళల్లో వికసించిన ఆధ్యాత్మిక పుష్పాలు కలబోసి ఒకచోట కుప్పపోసినట్లుగా అనుభూతి.

అతడలా తోటలో కొంతదూరం వెళ్ళి వెళ్ళి ఒకచోట ఆగాడు. ఒక గున్నమామిడి చెట్టుకింద స్వామి ధృవానంద కూర్చుని ఉన్నారు. కొమ్మల మధ్యనుంచి పడే వెన్నెల కిరణం ఒక చక్రంలా ఆయన తల చుట్టూ తేజస్సుతో నిండి ఉంది.

''రా నాయనా రా'' ఆయన పిలిచారు. కార్తికేయ కలలో మాదిరి దగ్గరకి నడిచాడు. ఆయన అన్నాడు. ''ఇలా కూర్చో''. అప్రయత్నంగా అతడు ఆయన కాళ్ళ దగ్గర కూర్చున్నాడు. ఆయన చిరునవ్వుతో అన్నారు. ''మా హడావుడి నీకు అప్రియంగానూ, అసంతృప్తిగానూ ఉన్నట్టుంది. మాలో వేదాంతం కన్నా ఆర్భాటమే ఎక్కువ కనపడ్డట్టుంది. అందుకే రోజంతా ముళ్ళ మీద ఉన్నట్టున్నావు''. కార్తికేయ మాట్లాడ లేదు.

''హిమాలయాల్లో చలికి తట్టుకోలేక అఖండ జ్యోతి వెలిగించి బదరీనాథ్ ఆలయానికి తాళం వేసి, ఆర్నెల్లపాటు అందరూ క్రిందికి వచ్చేస్తారు. అప్పుడు మేము అక్కడ ఉంటాము. ఆ చీకటి గుహల్లో హిమపాతాల్లో మనిషి అస్థిత్వాన్ని శోధించటం కోసం తపస్సు చేస్తూ ఉంటాము. మరి ఇదంతా ఏమిటని నీకు అనుమానం రావచ్చు. అందరూ నీలా దృఢ మనస్కులు ఉండరు నాయనా. వారికి ఓదార్పు కావాలి. అందువల్ల మేము జనారణ్యంలోకి వస్తూ ఉంటాము. ఈ రోజు వచ్చిన ధన కానుకలు వివేకానందుని ఆస్పత్రివారికి ఇచ్చేయడం జరిగింది. మనిషి మూర్ఖత్వాన్ని తమ స్వార్థానికి వాడుకునే స్వాముల్ని వదిలిపెట్టు. నీక్కనబడినదంతా నిజమని నమ్మకు. దానికి ఇదే ఉదాహరణ.''

"ఇప్పుడు నిన్ను ఎందుకు పిలిచానంటే..." అకస్మాత్తుగా ఆయన స్వరం అశరీరవాణిలా ధ్వనించింది. ''...మానవ సహజమైన బలహీనతల్ని తగిన వయసులో ఉపేక్షించి వదిలిపెడితే అవి దారి పక్కనే పొంచి ఉన్న బందిపోట్లవలె నీ వృద్ధాప్యంలో చుట్టుముట్టి బాధపెడతాయి. నీ భార్య ఆకుపచ్చ సర్ప కాలకూట విషంతో అచేతనమైంది. నీ జీవితంలో అది నిరంతరం నీ పక్కనే ఉండే 'కదిలే వైరాగ్యం' కానివ్వకు. వేదాంతం వేరు. వైరాగ్యం వేరు. ఆ విషయం మర్చిపోయి కష్టాల్లో పడకు.''

కార్తికేయ విభ్రాంతుడై ''స్వామీ'' అన్నాడు. ధృవానంద అతడివైపు చూడటం లేదు. తనలో తనే అలౌకికమైన స్థితిలో అనుకుంటున్నట్టు కొనసాగించారు. – ''ఉద్ధరేదాత్మనాత్మానం ఆత్మానమవసాదయేత్ ఆత్మైవ హ్యాత్మనో బంధుః

ఆత్మైవరిపురాత్మనః'' భగవద్గీతలో ఎంత గొప్పగా చెప్పబడింది. ''జీవుడు తనని తాను ఉద్ధరించుకోకపోతే పరులెవరు వచ్చి ఉద్ధరిస్తారు? అందుకేనేమో భగవంతుడు భక్తులకు స్వర్గప్రాప్తినిచ్చే ముందు ఎన్నో పరీక్షలకు గురిచేస్తాడు. బంగారం వన్నె తేవాలంటే కాల్చి కొట్టాలి కదా!''

కార్తికేయ అయోమయంగా ''మీరేం చెపుతున్నారో నాకు అర్థం కావటం లేదు'' అన్నాడు. అప్పుడా వృద్ధుడు 'ఒకే ఒక వాక్యంలో' ఉపనిషద్వేద సారాంశాన్ని చెప్పాడు.

**''కామ క్రోధ మాత్సర్యాల్ని అనుభవించి జయించాలే తప్ప అతీతుడవై వదిలి పెట్టకూడదు. జయిస్తే వేదాంతం. వదిలిపెడితే వైరాగ్యం.''**

ఆ వాక్యం కార్తికేయని తరువాత చాలాకాలం వేటాడింది, వెంటాడింది. ప్రక్షాళనం కోసం హిమాలయాలకు పంపింది. పునీతుడిని చేసింది. అతడు మామూలు మానవుడు. భవిష్యత్ తెలియని వాడు. ఏదో అనబోయాడు. ఆయన లేచి చీకట్లో భవంతి వైపు వెళ్ళిపోయాడు.

అతడు వెన్నెల మధ్యలో అలాగే ఉండిపోయాడు. చుట్టూ తివాచీ లాటి నిశ్శబ్దం. సన్నటి తిమ్మెర అతని మీదుగా పయనించి వెళ్ళిపోయింది. చెట్లకొమ్మలు గాలికి కదులుతూ ఉంటే అనుభవజ్ఞుడయిన సంగీత విద్వాంసుడు ఒకే సమయంలో అనేక వాయిద్యాలు వాయిస్తున్న అనుభూతి. **ప్రకృతి కన్నా గొప్ప సంగీత విద్వాంసుడెవరు? కదిలే గాలి వెదురు సందుల్లో రవళిస్తే మురళి. రావి ఆకు మీద అడవి తీగె కదిలితే వాయులీనం. ఊగే లత మీద వర్షపు చుక్క వీణావాదం. ఏటవాలు కెరటం మీద నీటి తుంపర జలతరంగిణి. రాళ్ళ సందుల దూకి పాకే నీటి పాయ సన్నాయి. ఎద పగిలే ఉరుమే ఢమరుక్కు.** సంగీతకారుడు సరిగమల నోట్ మీద సంగతులు వ్రాసుకుంటాడు. భగవంతుడు మనిషి నుదుటిమీద అతని సంగతులు వ్రాస్తాడు.

★★ ★★ ★★

తెల్లవారుజామున అయిదింటికి అతడు నిద్రలో పక్కన తడిమి చూశాడు. ఆమె లేదు. అతడు సందిగ్ధంతోనే మళ్ళీ తడిమాడు. ఆమె లేదు. అతడు చప్పున లేచి కూర్చున్నాడు.

పక్క ఖాళీగా ఉంది. లైట్ వేశాడు. గదంతా వెలుతురు. అతడికేమీ అర్థంకాలేదు. రివ్వున పక్క దిగి ''శ్రీ...'' అన్నాడు. ఎక్కడా అలికిడి లేదు. అతడికి భయం వేసింది. 'కళ్యాణీ' అని అరిచాడు.

షవర్ ఆగిన చప్పుడు. నెమ్మదిగా బాత్‌రూం తలుపు తెరుచుకుంది. తన కళ్ళని తానే నమ్మలేనట్టు చూశాడు. శ్రీకళ్యాణి గుమ్మం దగ్గర ని...ల్చు...ని ఉంది. 'కళ్యాణీ' అస్పష్టంగా గొణిగాడు. ఆమె గాలిలా వచ్చి అతన్ని అల్లుకుపోయింది. అతడింకా విభ్రమం నుంచి తేరుకోలేదు. ''నేను చూస్తున్నది నిజమేనా? ఎలా? ఎలా నీకు నయమైంది?'' అని అడిగాడు.

''వెళుతూ వెళుతూ స్వామి ధృవానందమహర్షి మనకిచ్చిన వరం.''

అతడేదో మాట్లాడబోయాడు. ఆమె వారించింది. చేత్తోకాదు. విడివడినాక ''దేవుడు మనకి పెదవులూ నాలుకా ఇచ్చింది కేవలం మాట్లాడుకోవటానికే కాదు. అంతకన్నా ఉపయోగకరమైన పనులు చాలా ఉన్నాయి'' అంది. విభ్రమంలోంచి తేరుకోలేక అతడేదో అనబోతూ ఉంటే, ''చూడండి. ఇన్నాళ్ళూ శవంలా పడుకుని మాట్లాడుతూనే ఉన్నా కదా. ఇప్పుడు కూడా మాటలేనా? మీ సంభ్రమావిభ్రమాలకి రేపు పగలంతా తీరిగ్గా ఆశ్చర్యపడుదురు గాని, సరేనా?'' అంది.

''తర్కంలో నిన్ను కొట్టలేను కళ్యాణీ.''

''పోనీ దేనితో కొట్టగలవు కార్తికేయా?''

''మైగాడ్! నేను మాట్లాడుతున్నది ఒక్క కనుచూపుతో పదిమందిని శాసించగల బిజినెస్ మాగ్నెట్‌తోనేనా?''

''రాత్రవగానే బిజినెస్‌ని హేంగర్‌కి తగిలించే ఉట్టి మాగ్నెట్‌తో.''

''నీకెప్పుడో ఒకప్పుడు ఇలా శరీరం స్వాధీనంలోకి వస్తుందని తెలుసుగా! అలా వచ్చిన వెంటనే నువ్వేమి చేస్తావనుకున్నానో తెలుసా? వెంటనే ఆఫీసుకి ఫోన్ చేసి, మానేజర్లకి సూచనలిచ్చి హడావుడిగా మీటింగులు ఏర్పాటు చేసే పనిలో నిమగ్నమై పోతావనుకున్నాను.''

''నాకు శరీరం స్వాధీనంలోకి వచ్చిన మరుక్షణం మీరేం చేస్తారనుకున్నానో తెలుసా?''

''ఏం చేస్తాననుకున్నావ్ కళ్యాణీ?''

''ఇలా... నేనిది చేస్తాను, నువ్వది చేస్తావనుకున్నాను అని మాటల్తో టైమ్ వేస్ట్ చేయరనుకున్నాను.''

''ఉష్షో...''

''లేకపోతే ఏమిటండీ. వ్యాపారం మాక్సీ విప్పి శృంగారం దుప్పటి కప్పుకోవల్సిన టైమ్‌లో మీ నుంచి ఆ మాత్రం సహకారం కూడా లేకపోతే ఎలా?''

ఒకేసారి పడ్డ ఇద్దరి బరువుకి, పక్కమీద దుప్పటి మల్లెపూవుకి మొరపెట్టు కోబోయి దాని స్థితీ అలాగే ఉండటంతో తన బాధని తనే, నలిగిన ముడతల్లో దాచుకుంది.

దీక్షా పట్టుదలా ఉన్న సైనికుడికి రహస్య స్థావరం పట్టుకోవటానికి అరగంట చాలు.

''ఏవండీ.''

''ఊ?''

''మీకు బాలమురళీకృష్ణ గాత్రం ఇష్టమా? మైకేల్ జాక్సన్ పాట ఇష్టమా?''

''బాలమురళీకృష్ణే''

‘‘అందుకేనా ఈ టైమ్‌లో కూడా ఆరోహణ అవరోహణం అంత నెమ్మదిగా సాగదీస్తున్నారు... బాబోయ్ ... నేరక అన్నాను స్వామీ. నకులుడో, సహదేవుడో గుర్తులేదు గానీ మిమ్మల్ని చూస్తుంటే నాకు అతను కూడా గుర్తొస్తున్నాడండీ.’’

‘‘ఎందుకో’’

‘‘ఎన్ని అవరోధాలొచ్చినా చినుక్కీ చినుక్కీ మధ్య తడవకుండా వేగంగా ఎక్కడికయినా వెళ్ళిపోగలిగినవాడు అతనే కదండీ’’ అంది. ఆ తడవకుండా ఉండగలగటం అన్న విద్యేదో నాకు వస్తే ఎంత బావుణ్ణు అనుకుంది పక్కమీద దుప్పటి. దాని బాధ గమనించినట్టు ఆమె పక్కకి తిరిగింది. తిరిగి ‘‘ఏవండీ’’ అన్నది.

‘‘మళ్ళీ ఏమిటి?’’

‘‘ఎవరెస్ట్ ఎక్కివచ్చాక టెన్సింగ్‌కి చాలామంది అమ్మాయిలు ఫ్రెండ్స్ అయివుంటారు కదూ.’’

‘‘ఎందుకు?’’

‘‘అంత ఎత్తయిన శిఖరం మీద కూడా కరెక్టుగా జెండా పాతాడు కదండీ’’

‘‘చూడూ. ఈ టైమ్‌లో కూడా నువ్వు రాముడ్నీ, నకులుడ్నీ, టెన్సింగ్‌నీ తల్చుకుంటే నా మేల్ ఈగో దెబ్బతింటుంది.’’

‘‘మైక్ టైసన్‌ని తల్చుకుంటే దెబ్బతినాలి కానీ, టెన్సింగ్‌ని తల్చుకుంటే దెబ్బ తినడం ఏమిటండీ?’’

‘‘కాస్సేపు మాట్లాడ్డం మానేస్తావా?’’

‘‘కనీసం మూలగొద్దా?’’

‘‘ఊహూ...’’

‘‘మీ మేల్ ఈగో దెబ్బతింటుందేమో?’’

‘‘మైగాడ్’’

‘‘ఏవండీ మేల్ ఈగో అంటే ఏమిటో ఒక్కమాటలో చెప్పండి చూద్దాం.’’

‘‘నాకు తెలీదు. నువ్వు చెప్పు.’’

‘‘ఫిమేల్ ఈగోకి ఒక మెట్టు పైనుండేది.’’

‘‘ఇష్షో’’

ఆమె చప్పున లేచి కూర్చుంది– ‘‘చూడండి... ఉష్షో... ఇష్షో... మైగాడ్... అబ్బా... అన్నవి ఆడవాళ్ళు అనవలసిన మాటలు. మాటిమాటికీ మీరంటూ ఉంటే నేనే మిమ్మల్ని ఏదో చేస్తున్నాననుకుంటారు.’’

‘‘సర్లే, సర్లే. నువ్వలా బర్త్‌డే సూట్‌లో బాసిం పెట్లేసుక్కూర్చుంటే బాలేదు. వచ్చి పడుకో.’’

‘‘పడుకోను. మీరూ కూర్చోండి. అన్నట్టు మీరు కీలుగుర్రం సినిమా చూశారా?

‘‘లేదు. ఏం?’’

‘‘దాంట్లో హీరో– హీరోయిన్ని ముందు కూర్చోబెట్టుకుని గుర్రం మీద మేఘాల్లో తీసుకెళ్తాడు!... ఆ సినిమా మీరు డైరెక్టు చేసి ఉంటే ఎలా తీసి ఉండేవారో తెలుసా?’’

‘‘ఎలా తీసి ఉండేవాణ్ణి?’’

‘‘ఇద్దర్నీ గుర్రంమీద పడుకోబెట్టి, దాని మెడ పట్టుకొమ్మని చెప్పి ఉండేవారు.’’

‘‘ఎందుకని?’’

‘‘కూర్చుని కూడా ఇద్దరూ ప్రయాణం చెయ్యొచ్చని మీకు తెలీదు కనుక’’

మొహం ఎర్రబడగా అతను ‘‘ఇవన్నీ నీకెలా తెలుసు?’’ అని అడిగాడు.

‘‘అయ్యో, మీ అనుమానం చూస్తుంటే అనూరాధా పోడ్వాల్‌ని ‘అనుభవం లేకుండా లతామంగేష్కర్‌లా ఎలా అంత బాగా పాడగల్గుతున్నావ్?’ అని అడిగేట్టూ ఉన్నారే. పైకి రావాలంటే అనుభవమే అక్కర్లేదండి. రావాలన్న తపనా, దీక్షా ఉంటే చాలు’’ అనేసి, ఆపై సిగ్గేసి, అతడి మెడ వంపులో మొహం దాచుకుంది.

వంపుల్లో కోరికే కాదు. నిశ్చింత కూడా ఉంటుంది. ఆ నిశ్చింతలో ఆమె తరపు నుంచి నిశ్శబ్దం అతనితో మాట్లాడింది. మౌనం మనసు విప్పింది.

***నవలనై నీతో ప్రతీ పేజీ చదివించుకోవాలని ఉంది.***

***నవల (స్త్రీ) నై నీతో ప్రతి అనుభవం పంచుకోవాలని ఉంది.***

***ఆలినై నీ మనసంతా నిండాలని ఉంది.***

***చిరుగాలినై నీ వళ్ళంతా సుగంధం పూయాలని ఉంది.***

***నా అనుభవాల్ని పంచేంద్రియాలకూ పంచి–***

***నే మీటుకుంటాను పరవశాల విపంచి!...***

ఆమె చాలాసేపు అలా మౌనంగా ఉండి, ‘‘ఏవండీ. నేనిలా నిశ్శబ్దంగా ఉంటేనే బావుందంటారా’’ అంది.

‘‘అబ్బబ్బా... చేతులూ కాళ్ళూ కదలొచ్చు. నే చెప్పేది ఈ టైమ్ లో లొడలొడా వాగటం గురించి...’’ అన్నాడు విసుగ్గా. ఆమె ఓ రెండు నిముషాలు అలాగే స్థబ్దుగా పడుకుని, తనలో తనే అనుకుంటున్నట్టుగా ఒక గొప్ప రహస్యం కనుక్కున్నట్టు ‘‘ఎంత పిచ్చిదాన్నండీ నేను. ఇంతకాలం పిల్లలు పుట్టాలంటే ఏమేమో చెయ్యాలనుకునేదాన్ని. ముక్కుతో గాలి పీలుస్తూ కాళ్ళూ, చేతులూ, కదిపితే చాలన్నమాట’’ అంది.

ఆమెలోంచి ఒక్కసారిగా అతడు విడివడి కోపమూ కసీ మిళితమైన స్వరంతో, ‘‘నిన్నూ – నిన్నూ’’ అన్నాడు.

ఆమె అమాయకంగా మొహం పెట్టి, ''అబ్బే! మనిద్దరం అనవసరంగా కష్టపడుతున్నామేమో అని...'' అంది. ఆ తరువాత ఎంత ఆపుకున్నా నవ్వు ఆగలేదు.''ఏవండీ. మరీ ఇలా మాట్లాడేస్తున్నానని ఏమీ అనుకోకండి. అమెరికాలో చూసొచ్చిన ఎక్స్–రేటెడ్ సినిమాల ప్రభావం! మరీ బరితెగించినదాన్లా...''

''ఛా...ఛా...'' ఆమెను ఆపుతూ అన్నాడు. ''భార్య అయినా. భర్త అయినా. ఎన్నేళ్లు గడిచినా, ఎంత వయసు పైబడినా, అందమైన, అద్భుతమైన, అపురూపమైన కమ్యూనికేషన్‌ని తెంపేసుకోకూడదు కళ్యాణీ! తెలిసీ తెలియని వయసులో రొమాన్సుకి 'పొటెన్షియాలిటీ' ఒక్కటే కావాలనుకునే వాడిని. 'స్పాంటేనియిటీ' కూడా కావాలని చెప్పావ్ నాకు.''

''థాంక్స్'' అంటూ అతడిని అల్లుకుపోయింది. ఆమె శరీరం అతడి చేతుల్లో మెలికలు తిరుగుతోంది. అతడిని ఆమె ఊపిరి కూడా పీల్చుకోనివ్వటం లేదు. ఎంత అనుభవించినా ఇంకా ఏదో మిగిలిపోయిందన్న ఆరాటం. పక్కనున్న అద్దాల్లోంచి వాళ్ళ శరీరాలు వాళ్ళనే రెచ్చగొడుతున్నాయి. ఆమె చెయ్యి అతడి భుజంమీద నుంచి క్రిందికి దిగి, నడుము క్రింద వృత్తాకారంలో తిరుగుతూ అతడిని రెచ్చగొడుతోంది. కొత్త కొత్త ప్రదేశాల్ని శోధిస్తోంది.

వయసొస్తే నెమలి పింఛం విప్పినట్టి, వసంతమొస్తే కోయిల కూసినట్టు, శ్రావణమొస్తే జల్లు కురిసినట్టు,సూర్యుడొస్తే తామరం వికసించినట్టు, హేమంతం వస్తే చలి విచ్చుకున్నట్టు... ఆమె అతనిని ఆహ్వానించింది. చిరుగాలికి ఊగే గడ్డిపరకలు సైతం అతడి నడుము కదలికలు చూసి 'లయ' నేర్చుకోవాలన్నట్టు కదిలాడు. పెదవి మీద దంతం ప్రేమలేఖ వ్రాస్తున్నట్టు ఆమె తీయగా మూలిగి, అతడిని మరింత గట్టిగా గోళ్ళతో నొక్కితే, ఆ గుచ్చిన చోటల్లా నునువెచ్చగా– ఆవేశం హెచ్చవగా, కుచ్చులు కుచ్చులుగా ఉచ్చులు బిగించి అతడామెను మచ్చిక చేస్తున్నాడు.

కదిలొొచ్చి కొట్టే కెరటమూ ఆగదు. స్థిరంగా నిలబడ్డ కొండా కరగదు. మన్మథుడికే అలసటొచ్చి ఇక చాలు అన్నప్పుడు ఘల్లుఘల్లున మ్రోగిన మువ్వలా, రవళి అల్లనల్లన ఆగి, ఆవేశం మెల్ల మెల్లన కరిగి– చల్లని వెన్నెల ఝురులై, పన్నీటి జల్లులై, తన వళ్ళు తనకే జల్లుమనేలా తడిసి...

కల చెదిరి అతడికి మెలకువ వచ్చింది. పక్కన కళ్యాణి గాఢ నిద్రలో ఉన్నది.

–0–

## అధ్యాయం–4

**డ్రైవరు** ఊరి మొదట్లోనే కారు ఆపుచేసి, డబ్బు తీసుకు వెళ్ళిపోయాడు. సిమ్లా పట్టణంలోకి కార్లు ప్రవేశించటానికి అనుమతి లేదు. ఊరి బయట ఆపుచేయాల్సిందే. సిమ్లా!! ఎప్పుడు క్రింది లోయలోకి జారిపోతుందా అన్నట్టు కొండ అంచున కట్టబడ్డ ఊరు.

కార్తికేయ తన బ్యాగ్ తీసుకుని నడవసాగాడు. చలి విపరీతంగా ఉంది. మంచు తుఫాను వచ్చే సూచన్లు కనపడుతున్నాయి. అయినా అక్కడి వాతావరణం చాలా ఆహ్లాదకరంగా ఉంది. దూరంగా ఎత్తైన కొండలు– వాటిమీద

వర్షంలా కురుస్తున్న మంచు. మంచు మీద పడి మెరిసే వెన్నెల... వీటికి కాంట్రాస్ట్‌గా పొడవాటి త్రిభుజాకారంలో సైప్రస్ చెట్లు.

నేపాల్ వెళ్ళే దారి దూరంగా కొండ మెలికల్లో అదృశ్యమవుతోంది. మరోవైపు ఒకదారి అవతలి కొండమీద తెల్లటి రిబ్బన్‌లా కనపడుతోంది. దేశంలోకెల్లా పెద్దదైన మోహన్ మెకీన్స్ వారి బీరు, విస్కీ తయారుచేసే ఫ్యాక్టరీ మీదుగా చండీఘర్ వెళ్తుంది ఇంకో దారి.

ఇంటిని నిర్లక్ష్యం చేయక ముందు కార్తికేయ తండ్రి కొడుకుని దేశమంతా తిప్పాడు. ఏ తండ్రైనా తన పిల్లలకి ఇవ్వగలిగే బహుమతి – పన్నెండేళ్ళ వయసులో రకరకాల సంస్కృతుల్ని చూపించటం..! అంతకన్నా గొప్పది ఇంకొకటి ఉండదు. ఇంత చిన్న విషయం చాలామంది తండ్రులకి తెలియకపోవటం భారతీయులు చేసుకున్న దురదృష్టం. టూరిజం కన్నా గొప్ప మానసిక వికాసం ఇంకొకటి లేదు. ఎన్ని పుస్తకాలు చదివినా ఆ విజ్ఞానం రాదు. తండ్రి వల్ల కార్తికేయ చిన్న వయసులోనే దేశమంతా చూశాడు. కన్యాకుమారిలో సముద్ర మిశ్రమాలు; గోవా నగరం మధ్యలో సముద్రపు బ్యాక్ వాటర్స్ లో పడవల మీద కార్లు అటు ఇటు ప్రయాణం చేయటాలు, టేక్డీలో మనుష్యులు బోన్లలో ప్రయాణం చేస్తూ స్వేచ్ఛగా తిరిగే ఏనుగుల్ని చూడటాలు, షిర్డీ 'కానేకేన్' గుడిలో భజనల ప్రతిధ్వనులకి భక్తులు స్పృహ తప్పి పడిపోవడాలూ, అజంతా ఎల్లోరా గుహల్లో తైలవర్ణ చిత్రాలు, కొచ్చిన్‌లో కొబ్బరిచెట్ల సమూహాలు, పాపికొండల పైకెళ్ళి అక్కణ్ణుంచి గోదావరిని చూడటం, మధ్యప్రదేశ్ అడవులమధ్య భయంకర ప్రయాణాలు, పూరీలో విశిష్ట నీలంరంగు సముద్రం, సాంచిలో బుద్ధుడు, వింధ్య పర్వతాల మధ్య నుంచి రైలు ప్రయాణం, బెంగాల్ బ్రాహ్మణుల చేపల ఇంటరెస్టు, కాశీలో పండారీల దౌర్జన్య దక్షిణ వసూళ్ళు, అనంతనాగ్‌లో హిమాలయాలమీద నుంచి కరిగివచ్చే స్వచ్ఛమైన నదీ ప్రవాహాలు, శ్రీనగర్‌లో గులాబీలు, ఢిల్లీ నానాజాతుల మిశ్రమం, విశాలమైన రోడ్లతో చండిఘడ్ ప్లాన్డ్ సిటీ, జలంధర్ నగర కాలుష్యం, బలవంతంగా కార్లు ఆపు చేసి పంచదార నీళ్ళు తాగించే హర్యానా ఆతిథ్యం, హృషీకేష్ తాళ్ళ వంతెన, జైపూర్ నుంచి జోధ్‌పూర్ వరకూ ఇసుక తిన్నెల మధ్య కారు ప్రయాణం, ఛంబల్‌వాలీలో భయం భయంగా ఎడ్లబండి మువ్వల చప్పుడుతో చీకటి రాత్రుల ప్రయాణం, ఆనంద్ పాల శీతల కేంద్రం, సూరత్ చేనేత శ్రామికుల దయనీయమైన బ్రతుకులు, కచ్ అవతల్నుంచి కనబడే పాకిస్తానీ పల్లెటూళ్ళు, లక్నో భవంతుల నిశ్శబ్ద సంస్కృతి, హైదరాబాద్ బారకాస్ చీకటి బజారుల్లో జరిగే రహస్య వ్యాపారాలు... చదవగలిగే కళ్ళుంటే 'దేశం' కన్నా మంచి పుస్తకం మరొకటి ఉందా?

అయితే అన్నిటికన్నా అతడికి నచ్చింది 'సిమ్లా'. ఎనిమిదేళ్ళ వయసులో తండ్రి చిటికెన వేలు పట్టుకొని, తల్లి చెయ్యి పట్టుకుని ఎత్తైక్కుతూ ఆ పట్టణంలోకి ప్రవేశిస్తున్నప్పుడే ఆ సౌందర్యం అతడి మనసులో ముద్రపడిపోయింది. ఆ తరువాత ఇంకెన్ని ప్రదేశాలు చూసినా, సిమ్లా మాత్రం ఒక సజీవ స్మృతిగా మిగిలిపోయింది. ఊటీ, కొడై, మనాలీ, డెహ్రాడూన్... ఏవీ అతడిని ప్రభావితం చేయలేకపోయాయి.

ఆ తరువాత ఒక్కసారిగా బీదతనం అతడిని చుట్టుముట్టింది. అది వేరే సంగతి.

గతస్మృతుల్ని నెమరువేసుకుంటూ అతడు చుట్టూ చూశాడు. ఊరు ఏమీ మారలేదు. అదే నేపాలీ సంస్కృతి.అవే చెక్కల ఇళ్ళు. ఎడమవైపు కొండ, కుడివైపు వెర్టిగో వచ్చేటంత ఏటవాలు లోయ. చెట్లు, అన్నీ చెట్లే. వాటి మధ్య నుంచి నగరంలో లైట్లు. చెట్లతో ప్రమిదచేసి, దాని మధ్యలో దీపం పెట్టినట్లుంది ఊరు.

అతడు తిరిగి నడవటం మొదలుపెట్టాడు. మరో పది నిముషాల్లో హోటల్ బ్రైట్ చేరుకున్నాడు. రిసెప్షన్ దగ్గర చాలామంది జనం ఉన్నారు. అతడు తన పేరు చెప్పాడు. అంత హడావుడిలోనూ మానేజర్ రిజిష్టర్ చూసి "యస్సర్. మీ పేరుమీద రిజర్వ్ అయింది. రూమ్ నెంబర్ 22" అన్నాడు. ఒక అస్సామీ కుర్రవాడు సామాన్లు తీసుకెళ్ళి రూమ్‌లో పెట్టాడు. కార్తికేయ కిటికీ తెరిచాడు. మొహానికి పెద్ద మంచుముక్క ఫెడీల్మని తగిలినట్టు కొట్టింది గాలి. అతడు ఉక్కిరి బిక్కిరై చప్పున పక్కకి తొలిగాడు. కొండల మీద నుండి వచ్చే గాలి, ఇరుకు భవంతుల మధ్య లోంచి వేగంగా ప్రయాణం చేస్తూంటే దాని 'హోరు' నిరాటంకంగా వినిపిస్తూనే ఉంది. కిటికీ తలుపులు వేస్తూ "హోటల్‌లో రద్దీ ఎక్కువగా ఉన్నట్టుందే" అన్నాడు కార్తికేయ,

"ఇక్కడే కాదు సాబ్. అశోకాలో మరీ రద్దీ. ఉన్నయే నాలుగు మంచి హోటళ్ళు. ఇక ఈ మూడు రోజులూ జనం వస్తూనే ఉంటారు. పోటీలున్నాయ్ కదా. అన్నట్టు మీరూ ఆ పోటీల్లో పాల్గొనటానికే వచ్చారా? ఊరికే ఊరు చూడటానికా?"

"పోటీకే".

"దేనిలో సాబ్" ఉత్సాహంగా అడిగాడు బాయ్.

"పెయింటింగ్" అన్నాడు కార్తికేయ.

బాయ్ దృష్టి ఫ్రేముకట్టి ఉన్న బొమ్మమీద పడింది. చుట్టూ కాగితాలతో ప్యాక్ చేయబడి ఉంది అది. "నేను చూడొచ్చా..." అని అడిగి, మళ్ళీ వెనక్కి తగ్గి, 'ఇప్పుడే వచ్చారు. రెస్టు తీసుకోండి సాబ్' అన్నాడు. తన ఆర్టు మీద ఎవరైనా ఇంటరెస్టు చూపిస్తే కళాకారుడు చిన్న పిల్లవాడై పోతాడు. కార్తికేయ అందుకు అతీతుడేమీకాదు. "చూడు, దానిదేముంది" అంటూ ప్యాకెట్ మీది ప్లాస్టిక్ కాగితాలు తొలగించి, వెలుతురులో పట్టుకున్నాడు.

(కొనసాగింపు వచ్చే నెలలో)

Click here to share your comments